క్లుప్తంగా

దట్టంగా పొగమంచు



కె.కోటపాడులో ఉదయం వేళల్లో కురుస్తున్న మంచు

కె.కోటపాడు : మండల గ్రామాల్లో ఉదయం వేళల్లో దట్టంగా పొగమంచు కురుస్తుంది. కె.కోటపాడు, చౌడువాడ, ఆనందపురం, ఎ.కోడూరు తదితర గ్రామాల్లో శనివారం కురిసిన పొగమంచుతో 9 గంటల సమయంలో కూడా వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది. ఈ శీతల ఉష్ణోగ్రతలతో చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. మామిడిపూత వచ్చే సమయంలో పొగమంచు వల్ల పూత రాలే పరిస్థితులు ఉన్నట్టు సాగు రైతులు చెబుతున్నారు.

89 మందికి ఉచిత వైద్య సేవలు

కె.కోటపాడు : సూదివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను శనివారం నిర్వహించారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిరణ్ 89 మందికి వైద్య పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందించారు. బి.పి, సుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలను వైద్యాధికారి సాయికిరణ్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌వీ భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ విజయ, ఏఎన్‌ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తురువోలులో జంతు సంక్షేమ పక్షోత్సవాలు

చీడికాడ : మండలంలో తురువోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా, పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు మాట్లాడుతూ మానవజాతి, మనుగడలో కీలకపాత్ర వహిస్తున్న జంతువుల పట్ల తీసుకోవాలిసిన జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు. ఎండాకాలంలో పశుపక్ష్యాదులు నీళ్ల లేక తిండి లేక ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పెదగోగాడ పశువైద్యాధికారి రాఘవమ్మ, హెచ్‌ఎం రామకృష్ణ, జి.పి.నాయుడు, పశువైద్య సహాయకులు రాజేష్ పాల్గొన్నారు.

డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

రోలుగుంట : విశాఖ డెయిరీ ఆస్తులు లూటీ చేస్తూ ఆవుపాలు సేకరణ తగ్గించి ధరలు కోత పెట్టిన యజమానిపై చర్యలను తీసుకోవాలని సీపీఎం నాయకుడు చిరంజీవి అన్నారు. రోలుగుంటలో శనివారం ఆయన మాట్లాడుతూ విశాఖడెయిరీ ఆవుపాల సేకరణలో 10 శాతం తగ్గించినట్టు తెలిపారు. గత నవంబర్‌లో ఆవు పాలకు లీటర్‌కు నాలుగు రుపాయలు తగ్గించారన్నారు. పాడి రైతులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. కార్పొరేషన్ స్ఫూర్తికి విరుద్ధంగా నడుస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

వాసవీమాతకు కుంకుమ పూజలు

మాడుగుల : మాడుగుల, జంపెన గ్రామంలో వెలసిన వాసవీమాతకు ఆత్మార్పణ ఉత్సవాల్లో భాగంగా శనివారం కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని పూలు, నగలతో ప్రత్యేకంగా అలకంరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనువాసరావు, ఆ సంఘ సభ్యులు పుట్టా మురళి, కొట్యాడ భాస్కరరావు, పుట్టా ప్రసాద్, పుట్టా మోహన్‌రావు, వనితా సభ్యులు పాల్గొన్నారు.

472 గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు



మాకవరపాలెం : జిల్లాలో 472 గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్టు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రామ్మోహన్‌రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. గత నెల 20 నుంచి 31 వరకు ఈ పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభించామన్నారు. ఈ శిబిరాల ద్వారా 19,525 మంది పాడి రైతులకు చెందిన 21,516 పశువులకు వైద్య సేవలు అందించామన్నారు. అలాగే మందులు ఉచితంగా అందజేసిట్టు వివరించారు. పశు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. జిల్లాలో 90 శాతం పశుగణన పూర్తయిందన్నారు.

సెలవు రోజునా మధ్యాహ్న భోజనం

మాకవరపాలెం: పది విద్యార్థులకు సెలవు రోజున కూడా మధ్యాహ్న భోజనం అందిస్తామని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి శనివారం తెలిపారు. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున ఈ నెల 2 నుంచి మార్చి 10 తేదీ లోపు వచ్చే సెలవు రోజున కూడా భోజనం అందిస్తామన్నారు. ఈ విషయంపై మండలంలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చామన్నారు.

బెల్లం రైతుకు అందని తీపి

- గిట్టుబాటు కాని ధరలు
- నష్టాలు చూస్తున్న రైతులు
- పెరిగిన పెట్టుబడులతో కుదేలు



విజయరామరాజుపేటలో చెరకు గానుగ ఆడుతున్న రైతులు

చెరకు రసం బెల్లం తయారీకి మరిగిస్తున్న రైతు

బుచ్చెయ్యపేట : అందరి నోళ్లకు తీపిని అందించే బెల్లం రైతులకు మాత్రం చేదే మిగులుతోంది. సంక్రాంతి పండగ సమయంలో కూడా బెల్లం ధరలు లేకపోగా తగ్గిన ధరలతో రైతులు తీవ్ర నష్టాలు చూస్తున్నారు. ఒక పక్క పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు,కూలీ ఖర్చులతో సతమతం అవుతున్న రైతులకు తగ్గిన బెల్లం ధరలతో మరింత కుంగి పోతున్నారు. ఎకరం చెరకు సాగుకు రూ. 30 వేల నుంచి రూ.35 వేలు వరకు ఖర్చవగా బెల్లం ఆడగా రూ.25 వేల నుంచి రూ.30 వేలకు మించి రావడం లేదని రైతులు వాపోతున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో విజయరామరాజుపేట, మంగళాపురం, కుముదాంపేట, రాజాం, సీతయ్యపేట, తైపురం, చిట్టియ్యపాలెం, కొండెంపూడి, కేపీ అగ్రహారం, గున్నెంపూడి, పెదపూడి, తురకలపూడి తదితర గ్రామాల్లో పలువురు చెరుకు రైతులు క్రషర్లు ఏర్పాటు చేసి బెల్లం తయారీపై ఆధారపడి జీవిస్తున్నారు.

8వేల ఎకరాల్లో చెరకు బెల్లం తయారీ

బుచ్చెయ్యపేట, చోడవరం, రావికమతం, రోలుగుంట మండలాల్లో 8 వేల ఎకరాల్లో చెరుకును బెల్లం తయారీకి రైతులు వినియోగిస్తున్నారు. గతంలో మణుగు (10 కేజీలు) బెల్లం దిమ్మ ధర రూ. 450 నుంచి రూ. 500 వరకు ఉండగా ఇపుడు రూ.300 నుండి రూ.400 వరకు ధర పలుకుతుందని రైతులు వాపోతున్నారు. ఎకరం పొలంలో చెరకు తోట 20 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను చెరకు గానుగ ఆడగా 8 నుంచి 10 బెల్లం దిమ్మలు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. పొలం దుక్కులు, చెరకు విత్తన ఖర్చులు, ఎరువులు, నీటి తడులు, చెరకులో కలుపు నివారణ గొప్పులు, కాలువలు, జెడ చుట్టులు, చెరకు నరుకు కూలి, ఆకులు ఏరివేత, చెరకు తరలింపు, బెల్లం క్రషర్ ఖర్చులు, ఆడిన బెల్లం దిమ్మలు అమ్మకానికి అనకాపల్లి మార్కెట్‌కు తరలింపు రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి కష్టపడిన ఎకరాకు రూ.ఐదారువేలు ఆదాయం కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు.

దుకాణాల్లో కేజీ బెల్లం రూ.65 వరకు అమ్మకాలు సాగుతున్న రైతులకు మాత్రం తక్కువ ధర అందించడంపై పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చెరకు రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టి బెల్లం మద్దతు ధర అందించి ఆదుకోవాలని పలు గ్రామాల బెల్లం తయారీ రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు కల్పించాలి



చెరకు తోటలు సాగు చేసి బెల్లం గానుగ ద్వారా ఉపాధి పొందుతున్నాం. గతంలో పది కేజీల బెల్లం దిమ్మ రూ. 500 వరకు ధర ఉండేది. ప్రస్తుతం బెల్లం దిమ్మ రూ. 350 నుంచి రూ. 400 వరకు ఉంది. బెల్లం ధర తగ్గడంతో నష్టాలు చూస్తున్నాం. షాపుల్లో బెల్లంకు ధర ఉన్నా బెల్లం తయారీ చేసే మాకు మాత్రం గిట్టుబాటు ధర ఉండడం లేదు. ప్రభుత్వం బెల్లంకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– శిలపరశెట్టి ఎర్రినాయుడు, కుముదాంపేట

ఉపాధికి అనుసంధానం చేయాలి



నేను 30 ఏళ్లకుపైగా బెల్లం తయారీ చేసి అమ్మకాలు చేస్తున్నాను. ప్రతి ఏటా 5 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో చెరకు సాగు చేపట్టి బెల్లం తయారు చేసి ఉపాధి పొందుతున్నాను. గతంలో కన్న వ్యవసాయ పెట్టుబడులు ఖర్చులు పెరిగినా బెల్లం ధర మాత్రం తగ్గుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీల ఖర్చులు ప్రభుత్వం భరించినా మాకు గిట్టుబాటు అవుతుంది. చెరకు రైతులను ఆదుకోవాలి.

– ఎల్లపు గోవింద, విజయరామరాజుపేట

96శాతం పింఛన్ల పంపిణీ



మాడుగులలో పింఛన్లు పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు

మాడుగుల రూరల్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం తెల్లవారుజామున ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పింఛనుదారుల ఇంటికి వెళ్లి, పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 11,605 మందికి మధ్యాహ్నం 11 గంటలకు 9,081 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. సాయంత్రం నాటికి 96 శాతం మేర పింఛన్లు పంపిణీ చేశారు. శనివారం పింఛన్లు తీసుకోని వారు ఈ నెల 3వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

కె.జె.పురంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం కళ్యాణ మండపంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం ఎర్పాటు చేసారు. గాజువాక కిరణ్ విజన్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 75 మంది కంటి రోగులును కంటి వైద్యులు పి.శ్రీనివాసరావు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తక్కువ ధరకు కంటి అద్దాలును అందించారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జామి రమణబాబు ప్రారంబించారు. కార్యక్రమములో మండల మాజీ బిజెపి అధ్యక్షులు సాలాపు వీరునాయుడు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ భూపతి శ్రీకాంత్, పోగ్రామ్ అధికారి కె. డేవిడ్ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయండి

పోలీసు అధికారులతో 9వ అదనపు జిల్లా జడ్జి



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి



హాజరైన పోలీసు అధికారులు సిబ్బంది

చోడవరం రూరల్ : లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం కావడానికి పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్న కుమార్ కోరారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో చోడవరం కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో వచ్చే నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయడానికి సన్నాహక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి రత్న కుమార్ మాట్లాడుతూ మార్చిలో జాతీయ స్థాయి లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సంగతి వెల్లడిస్తూ, ఇరు వర్గాల సమ్మతితో పరిష్కరించ గలిగే కేసులను గుర్తించి వారి మధ్య సయోధ్యకు కృషి చేయాలని చెప్పారు. లోక్ అదాలత్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరింపబడితే కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు. ప్రధాన సివిల్ జడ్జి జి.స్వర్ణ మాట్లాడుతూ ఇరు వర్గాలకు ప్రయోజనం కలగడంతో పాటు కోర్టుల చుట్టూ తిరిగి కాలయాపన చేయాల్సిన అగత్యం ఉండదన్న సత్యాన్ని వారికి తెలపాలన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ మాట్లాడుతూ కేసులకు లోక్ అదాలత్‌లో పరిష్కారం ద్వారా పోలీసులు, కోర్టులకు సమయం, రికార్డుల మెయింటెనెన్స్ వంటి ఇబ్బందులు తప్పుతాయన్నారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.రమణమ్మ, చోడవరం సీఐ అప్పలరాజు, ఇతర పోలీసు అధికారులు తమ సలహా, సూచనలను అందజేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



కె.జె.పురం హైస్కూలులో ప్రచారం చేస్తున్న విజయగౌరి

మాడుగుల రూరల్: విద్యారంగం పరిరక్షణకు అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పి.డి.ఎఫ్. ఎమ్మెల్సీ అభ్యర్థి కె. విజయగౌరి పేర్కొన్నారు. ఈ నెల 27 వ తేదీన జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శనివారం మండలంలో పలు పాఠశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె యు.టి.ఎఫ్ నాయకులతో కలిసి మాట్లాడుతూ 117 జీవో, సీపీఎస్ రద్దు వంటి దీర్ఘకాలిక అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోస్తామన్నారు. యు.టి.ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షురాలు గాయిత్రి, కార్యదర్శి పోలిమేర చంద్రరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏవో చిరంజీవి

మాకవరపాలెం : సాగుపద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఏవో చిరంజీవి విద్యార్థులకు వివిధ రకాల పంటలు, వాటిని సాగు చేసే విధానంపై తెలియజేశారు. ఉద్యాన పంటలపైనా వివరించారు. చిన్ననాటి నుంచి సాగు విధానాలను తెలియజేయడంలో భాగంగా ప్రత్యేకంగా వ్యవసాయ అధికారితో అవగాహన కల్పించినట్టు హెచ్‌ఎం కె.రాము తెలిపారు. కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చే ఖరీఫ్ నాటికి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు



ఎల్‌బీపురం ఎత్తిపోతల పథకం పనులు పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం

బుచ్చెయ్యపేట : మండలంలో ఎల్.బి.పురం ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులుకు సాగునీటి అందిస్తామని, ఇరిగేషన్ ఈఈ పి. త్రినాథం అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకానికి రూ.4 కోట్లు వ్యయంతో పనులు చేపట్టామని అన్నారు. ఎల్.బి.పురం, బంగారుమెట్ట, గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి 350 ఎకరాలకు ఈ పథకం ద్వారా సాగునీరు అందుతుందన్నారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని, రైతులు సూచనలు, అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని కాలువలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశం నేడు

దేవరాపల్లి: మండల కేంద్రంలో ఆదివారం మండల దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తున్నట్టు మండల నాయకుడు కాటపల్లి అప్పారావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలోని సన్యాసమ్మ ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ స మావేశం జరుగుతుందన్నారు. దళిత సంఘాలు ఐక్యతగా నూతన సంఘం ఆవిర్భావం ప్రకటన, నూతన కార్యవర్గం ఏర్పాటు భవిష్యత్ కార్యాచారణపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల దళిత సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శన



కుసుర్లపూడి హైస్కూల్లో ప్రదర్శనను తిలకిస్తున్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



ప్రదర్శనలో ఉంచిన ఏటికొప్పాక బొమ్మలు

రోలుగుంట : కుసర్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శనను శనివారం ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అప్పాన రాంబాబు స్ఫూర్తితో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో జాతీయ భావం, పనిపట్ల గౌరవం, ఈ ప్రదర్శన వల్ల ఏర్పడుతుందని పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహనరావు అన్నారు. ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసిన శకటానికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీ నుంచి మూడో స్థానం సంపాదించారన్నారు. ఈ బొమ్మలను అంకుడు కర్రతో సహజ సిద్ధమైన రంగులతో తయారు చేస్తారని, ఇది అంతర్జాతీయంగా ప్రాముఖ్యత కలిగి ఉందని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.పద్మావతి పాల్గొన్నారు.

చిన్న సమస్యలపై పంతాలు వద్దు



పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగశిరీష

నాతవరం : ప్రతి చిన్న విషయానికి పంతాలు పట్టింపులకు పోయి వివాదాలు పెంచుకోని విలువైన సమయాన్ని వృథా చేసుకోవడమే కాకుండా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడతారని మండల ప్రత్యేకాధికారి నాగశిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్‌ఎస్ దరఖాస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న సమస్యలను సైతం వ్యక్తిగత పట్టింపులకు పోవడం వల్ల మీతో పాటు ఇతరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజు ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ పార్థసారధి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

మాడుగుల రూరల్ : మహాత్మా గాంధీ తీర్థం సందర్భంగా శుక్రవారం రాత్రి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రాత్రి 12 గంటల వరకు పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దాడి రాము ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

కనీస వేతనం అమలు చేయాలి



కె.కోటపాడులో నిరసన తెలుపుతున్న కార్మికులు

కె.కోటపాడు : జిల్లాలో గల ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి ప్రభుత్వ జీవో ప్రకారం కనీస వేతనాలను అందించాలని ఏపీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక సీహెచ్‌సీ వద్ద ఆస్పత్రి కార్మికులకు కనీస వేతనాలను అందించాలని శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ల ఏఐటియూసీ నాయకులు శేఖర్, పారిశుధ్య సిబ్బంది నాగరత్నం, అరుణకుమారి, లక్ష్మి, సత్యవతి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, ఈశ్వరమ్మ, నూకరత్నం పాల్గొన్నారు.

మాడుగుల : జిల్లాలో జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేస్ట్ కార్మికులకు, ప్రభుత్వ జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ఏఐటీయుసీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక 30 పడకల ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కనీస వేతనాలు అమలు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి వారి డిపాజిట్లు నిలుపుదల చేయాలన్నారు.

గాంధీపార్కు పరిశుభ్రం



గాంధీపార్కును శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మాడుగుల: ఈనెల 31వ తేదీన గాంధీజీ వర్ధంతి రోజున స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించకపోవడంతో 'మహాత్ముని మరిచారు' అని సాక్షిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ ఈవో మూర్తిబాబు ఆధ్వర్యంలో శనివారం గాంధీ మహాత్ముని విగ్రహాన్ని శుభ్రపరచి, పార్కు ఆవరణ అంతా తుడిచారు.

4న మసమ్మ అమ్మవారి తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో గల శ్రీ మసమ్మ తల్లి తీర్థం ఈ నెల 4వ తేదీ రథ సప్తమి రోజున ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు, గుర్రాల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎడ్ల పోటీల్లో ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ.8వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు, నాలుగో బహుమతి రూ.3వేలు, ఐదో బహుమతి రూ.2వేలు విజేతలకు అందజేస్తామన్నారు. గుర్రాల పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో, ఐదు బహుమతులుగా వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు చొప్పున విజేతలకుఅందజేస్తామన్నారు. అలాగే దాతల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన, 101 ఘటాలతో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఇంజినీరింగ్‌లో జ్ఞానమే పెట్టుబడి

అవంతిలో ముగిసిన సాంకేతిక సదస్సు



ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రముఖులు

మాకవరపాలెం: ఇంజినీరింగ్‌లో జ్ఞానమే పెట్టుబడని ఇందుస్థాన్ షిప్‌యార్డ్ జనరల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సినర్జీ 2025 పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సాంకేతిక సదస్సులు శనివారంతో ముగిసాయి. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్య పొందిననాడే సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీమంత్రి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విజయనగరం జెఎన్‌టీయు డైరెక్టర్ బాబులు, శ్రీనివాస పినిశెట్టి(ఐఐటి భువనేశ్వర్), రవికిరణ్‌శాస్త్రి(ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్)తోపాటు పలువురు ప్రముఖులు సాంకేతికతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు మాట్లాడుతూ ఈ సదస్సులో 54 సాంకేతిక నమూనాలు, 230 పేపర్ ప్రజెంటేషన్‌లు, 86 పోస్టర్ ప్రెజెంటేషన్లు ప్రదర్శించారన్నారు. ఈ ప్రదర్శనల్లో ఉత్తమ నమూనాలు రూపొందించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు



కె.జె.పురం జంక్షన్ సమీపంలో చేపట్టిన రహదారి మరమ్మతు పనులు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం జంక్షన్ నుంచి దబ్బకుంటు రహదారి మీదుగా మాడుగుల తాచేరు వంతెన వరకు రహదారి మరమ్మతు పనులు గురువారం ప్రారంభించారు. రోడ్లు, భవనాల శాఖ నిధులతో 6.60 కిలోమీటర్లకు రూ.11 లక్షల నిధులతో ఈ రహదారి పనులను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బొశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చొరవతో నిధులు మంజూరు అయ్యాయని ఎంపీటీసీ పేర్కొన్నారు. ఈ నిధులతో రహదారిలో గోతులను పూడ్చుతున్నారు. రహదారి కిరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టామని ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్ తెలిపారు. కె.జె.పురం జంక్షన్‌లో 68 కుటుంబాల వారు నివసిస్తున్నారు. డ్రైనేజిలు లేక ఇళ్లలోని మురుగునీరు రోడ్లు మీద పొంగి ప్రవహిస్తుందని, ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని ఎంపీటీసీ తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com